



సకల సిద్ధి ప్రాప్తిరస్తు..!

- జిల్లా వ్యాప్తంగా మొదలైన సందడి
- మట్టి విగ్రహాలకు భలే గిరాకీ
- నేడు వినాయక చవితి

నంద్యాల కల్చరల్/ ఎడ్యుకేషన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : విఘ్నాలు తొలగి శుభాలు అందించే వినాయకుడి వేడుకలకు జిల్లా సిద్ధమైంది. 'వినాయక చవితి'ని బుధవారం నంద్యాల జిల్లా ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకోనున్నారు. ఈ ఏడాది వినాయక చవితి పండుగ సందడి బాగా కానవస్తోంది. ఈ వేడుక సందర్భంగా నిర్వహించే 'గణేశ్ మహోత్సవాలు' వాడవాడలా అంగరంగ వైభవంగా ఆరంభించేదుకు నిర్వాహకులు సన్నద్ధమయ్యారు. ఉమ్మడి జిల్లాలోని ఆయా పట్టణాలు, గ్రామాల్లో గణేశ్ ఉత్సవ కమిటీల నిర్వాహకులు భారీ వినాయక ప్రతిమలు నెలకొల్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని వివిధ వాడలు, పట్టణ ప్రాంతాల్లోని వీధుల్లో, నాలుగు రోడ్ల కూడళ్ల, చౌరస్తాలలో గణేశ్ మంటపాల్లో నెలకొల్పిన విగ్రహాలు కనువిందు చేస్తున్నాయి. ఉత్సవాలను ఉత్సాహంగా నిర్వహించేందుకు కమిటీల నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గతంతో పోల్చితే మట్టి విగ్రహాలకు ప్రాధాన్యత పెరుగుతోంది. విద్యాధికులైన వారంతా పర్యావరణంపై అవగాహనతో మట్టి విగ్రహాలపై ఆసక్తి చూపిస్తున్నారు. గృహాల్లో వినాయక ప్రతిమలు నెలకొల్పి పూజించేవారు చిన్న చిన్న వినాయక ప్రతిమలు, పూజా సామగ్రి, పత్రి, పూలు, పండ్లు కొనుగోళ్లకు రావడంతో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రధాన వీధులన్నీ కిటకిటలాడాయి. గ్రామీణ ప్రాంతాల్లో లభించే గరిక, జిల్లేడు, గన్నేరు తదితర పూలను పట్టణ ప్రాంతాలకు తీసుకువచ్చి అమ్మకాలకు పెట్టారు. కొబ్బరి మట్టలు, వెలగకాయలు, సీతాఫలం, అరటి బోదెలు, కంకులు, చెరకుగడలు వంటి వాటికి గిరాకీ ఏర్పడింది. ఈ క్రమంలో బంతిపూలు రూ.140 నుంచి రూ.250 వరకు ధరలు పలికాయి. చెరకు గడలు, వెలగకాయలు, జిల్లేడు, మారేడు, రావి, గరిక పత్రాలకు డిమాండ్ ఏర్పడింది. మామిడి తోరణాలు, కొబ్బరి మట్టలు, అరటి బోదెలు కూడా అధిక ధరలు పలికాయి. నంద్యాలలో కల్పనసెంటర్, గాంధీచౌక్, టెక్కె మార్కెట్‌యార్డు, నూనెపల్లె తదితర ప్రాంతాలు చిన్న మట్టి విగ్రహాలు, పూజా సామగ్రి కొనుగోళ్లతో కళకళలాడాయి.



ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ప్రతిమల విక్రయం





విక్రయానికి సిద్ధం చేసిన పూలు

ప్రజలు ఆదరిస్తున్నారు

గత రెండేళ్లతో పోలిస్తే ప్రజలు మట్టి వినాయక ప్రతిమలపై ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నారు. తాము ప్రత్యేకంగా ఆకర్షణగా ఉండేలా కలకత్తా నుంచి మట్టి ప్రతిమలను తెప్పించి విక్రయిస్తున్నాము. గత ఏడాది వెయ్యి విగ్రహాలను విక్రయించాము. ఈసారి రెండు వేలకు పైగానే విక్రయాలు జరిగేలా ఉన్నాయి. ఈ విగ్రహాలు పర్యావరణానికి ఎలాంటి హాని కల్గించవు. అడుగు నుంచి ఏడు అడుగుల వరకు కూడా విగ్రహాలు విక్రయించాము. నీటిలో నిమ్మజ్జనం చేసిన 10నిమిషాలకే కరిగిపోతాయి.

● సుజీత్‌కుమార్, మట్టి విగ్రహాల వ్యాపారి

నిబద్ధతతో పని చేసినవారికి పదవులు

- సూపర్-6 సూపర్‌హిట్‌గా అమలు చేశాం
- ఎక్కడ చూసినా ప్రజల్లో సంతృప్తి
- కార్యకర్తలే టీడీపీకి బలం
- త్రిసభ్య కమిటీ సభ్యులు సోమిరెడ్డి, నాగరాజు, కోవెలమూడి నాని



మాట్లాడుతున్న త్రిసభ్య కమిటీ సభ్యుడు సోమిరెడ్డి, పక్కన మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు

నంద్యాల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన ప్రతి ఒక్కరికి పదవుల్లో అవకాశం కల్పిస్తామని త్రిసభ్య కమిటీ సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, గుంటూరు మేయర్ కోవెలమూడి నాని, ఏపీఎస్‌ఆర్టీసీ కడప జోన్ చైర్మన్, రాష్ట్ర పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ పూల నాగరాజు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో జిల్లా పార్లమెంట్ విస్తృతస్థాయి సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసమావేశానికి త్రిసభ్య కమిటీ సభ్యులతో పాటు మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే సూర్యప్రకాశ్‌రెడ్డి, గౌరు చరిత, భూమా అఖిలప్రియ, బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, గిత్తా జయసూర్య హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సోమిరెడ్డి మాట్లాడుతూ సుదీర్ఘకాలం టీడీపీ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు తప్పకుండా న్యాయం జరుగుతుందన్నారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలతో పాటు ఎంపీని సైతం గెలిపించడం అభినందనీయమన్నారు. గుంటూరు మేయర్ నాని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్-6 హామీలను పక్కాగా అమలు చేసిందన్నారు. ఎక్కడ చూసినా ప్రజల్లో సంతృప్తి నెలకొందని గుర్తు చేశారు.

మిగతా 8వ పేజీలో



వినతులు స్వీకరిస్తున్న పూల నాగరాజు, ఎంపీ బైరెడ్డి శబరి

యూరియా కొరత లేకుండా చూడండి

మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కలెక్టర్ రాజకుమారికి సూచించారు. మంగళవారం బొమ్మలసత్రంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి యూరియా కొరతపై కలెక్టర్‌తో చర్చించారు. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ పంటలకు అవసరమైన మేరకు యూరియాను రైతులకు అందుబాటులో ఉంచాలని, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు కూడా యూరియా వాడకం, నిల్వలపై అవగాహన కల్పించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ మాట్లాడుతూ రైతులు తమ పంటలకు సరిపడా యూరియాను మాత్రమే తీసుకోవాలని, కొరత ఏర్పడుతుందన్న ఆందోళనతో అధిక మోతాదులో యూరియా కొనుగోలు చేయవద్దని కోరారు.



కలెక్టర్‌తో చర్చిస్తున్న మంత్రి బీసీ

పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు

కలెక్టర్ రాజకుమారి

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి సులభతరంగా అనుమతులు మంజూరవుతున్నాయని కలెక్టర్ రాజకుమారి వెల్లడించారు. నంద్యాలలోని పీజీఆర్ఎస్ హాల్‌లో మంగళవారం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై పారిశ్రా మికవేత్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు చేయూతనిచ్చేందుకు రాష్ట్ర, జిల్లా యంత్రాంగం పారిశ్రామికవేత్తలకు అండగా ఉంటుందన్నారు. జిల్లాలో ఎక్కువశాతం హార్టికల్చర్, పసుపు, సుగంధద్రవ్యాలు, పూలు, పండ్ల మొక్కల పెంపకం చేపడుతామన్నారు. జిల్లాలో సుమారుగా 33శాతం అటవీ ప్రాంతం ఉండగా ఒకటిలో మూడు శాతం సాగుభూమి ఉందన్నారు. జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయడానికి ఉత్సాహవంతులైన పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని కోరారు. సదరు సంస్థల ఏర్పాటుకు బ్యాంకర్స్ నుంచి పూర్తి సహకారం అందిస్తామన్నారు. సమావేశంలో పరిశ్రమలశాఖ జీఎం మహబూబ్ బాషా, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణరెడ్డి, కార్మికశాఖ సహాయక కమిషనర్ బషిరున్నీసాబేగం, కాలుష్య నియంత్రణ సంస్థ ఈఈ కిశోర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

గడువు పెంపు

- 29 వరకు బార్ల కోసం దరఖాస్తులు

నంద్యాల, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): బార్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం గడువును పెంచింది. ఈనెల 29 వరకు పొడిగిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. వివిధ కారణాల నేపథ్యంలో ఈ నెల 18 నుంచి 26 వరకు గడవు ప్రకటించి దరఖాస్తులు స్వీకరించినా ఆశించిన స్థాయిలో రాలేదు. ఇప్పటివరకు జిల్లాలోని జనరల్ -19, కల్లు గీత కార్మికులు-2 మొత్తంగా 21 బార్లకు 65మంది మద్యం వ్యాపారులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోగా ఐదుగురు మాత్రమే తమ టెండర్లును అధికారులకు సమర్పించినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ తెలిపారు. ఆ శాఖ కమిషనర్ నిశాంత్‌కుమార్ 29వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు గడువు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో బార్ల వ్యాపారులు ఊపిరి పీల్చుకున్నట్లైంది.

జాతీయ ప్రతిభా పురస్కారాలకు ఉపాధ్యాయుల ఎంపిక

నంద్యాల హస్పిటల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): దక్షిణ ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ ప్రతిభా పురస్కారాలకు నంద్యాల బాల అకాడమీ ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. ఈ నెల 31న గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిర్‌లో కేవీఆర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ అవార్డులు అందజేస్తారు. బాల అకాడమీ రవీంద్ర పాఠశాల ఉపాధ్యాయులు వి.లక్ష్మీనారాయణ, ఎం.సురేష్‌బాబు ఈ అవార్డుకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ ఎంజీవీ రవీంద్రనాథ్, ప్రిన్సిపాల్ మాధవీలత తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన ఉపాధ్యాయులను తోటి సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.



లక్ష్మీనారాయణ



సురేష్‌బాబు

చెంచుల జీవన ప్రమాణాలు మెరుగుపడాలి

- న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి

ఆత్మకూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): చెంచుల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా అన్ని ప్రభుత్వ శాఖలు బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి సూచించారు. మంగళవారం మండలంలోని కొట్టాలచెరువు చెంచుగూడెంలో ఆయా శాఖల అధికారులతో కలిసి అవగాహన సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెంచుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై అవగాహన పెంచుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రత్యేకించి రేషన్‌కార్డు, ఆధార్, ఆరోగ్య, కుల, కుటుంబసభ్యులు ధృవీకరణపత్రం తదితర వాటి మంజూరుకు ఆయా శాఖలు చెంచులకు పూర్తిస్థాయిలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మహిళా, గిరిజన హక్కుల చట్టాలు, బాల్య వివాహ నిర్మూలన చట్టం తదితర వాటిపై లీగల్ సర్వీసెస్ యాక్ట్ 1987 ద్వారా ఉచిత న్యాయ సలహాలను అందివ్వనున్నట్లు చెప్పారు. అనంతరం ఆయా శాఖలకు చెందిన స్టాళ్లను వారు సందర్శించారు. కార్యక్రమంలో శ్రీశైలం ఐటీడీఏ పీవో వెంకట శివప్రసాద్, ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి, డీఎంహెచ్‌వో వెంకటరమణ, సోషల్ వెల్ఫేర్ డీడీ చింతామణి, డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, తహసీల్దార్ రత్నరాధిక, ఎంపీడీవో ఉమర్, ఆత్మకూరు అర్బన్, రూరల్ సీఐలు రాము, సురేష్‌కుమార్‌రెడ్డి, జిల్లా చైల్డ్ ఆఫీసర్ స్వప్నప్రియ, ఆత్మకూరు ఐసీడీఎస్ సీడీపీవో సూర్యకుమారి, సర్పంచ్ నాగలక్ష్మి ఉన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి

పెన్ను క్యాప్‌పై 60 సూక్ష్మ వినాయకులు

నంద్యాల కల్చరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణానికి చెందిన ప్రముఖ చిత్ర కారుడు చింతలపల్లె కోటేష్ వినాయక చవితి పండుగ పురస్కరించుకొని పెన్ను క్యాప్‌పై మైక్రో బ్రష్ ద్వారా వాటర్ కలర్స్‌తో 60 సూక్ష్మ వినాయకులను రూపొందించారు. వివిధ రూపాలలో 2 గంటల వ్యవధిలోనే 60 సూక్ష్మ వినాయకుల చిత్రాన్ని వేశారు. ఈ చిత్రంలో గణనాథుడు భక్తులకు అభయమిస్తున్నట్లు, ఓం ఆకారంలో గణపతులు, శంకు ఆకారంలో గణేశుడు, కాణిపాకం గణపతి, త్రిముఖ గణపతి, నాట్యబంగిమ.. ఇలా అనేక రూపాలలో రూపొందించి ఔరా అనిపించారు.





పెన్ను క్యాప్‌పై చిత్రాలను చిత్రీకరిస్తున్న కోటేష్

రథసారథి ఎవరో?

- టీడీపీ జిల్లా అధ్యక్ష స్థానానికి డిమాండ్
- 12 మంది దరఖాస్తులు

నంద్యాల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా సారథిగా ఎవరన్నది ప్రస్తుతం ఉత్కంఠగా మారింది. నంద్యాల జిల్లా అధ్యక్ష స్థానం కోసం 'త్రీమెన్ కమిటీ'కి 12 దరఖాస్తులు రావడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. మంగళవారం జరిగిన టీడీపీ ముఖ్య నాయకుల సమావేశంలో త్రీమెన్ కమిటీ సభ్యులైన మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, గుంటూరు మేయర్ కోవెలమూడి నాని, ఏపీఎస్‌ఆర్టీసీ కడప జోన్ చైర్మన్ పూల నాగరాజులు ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించి ఎంపీ, ఎమ్మెల్యేలు, కీలక నాయకులతో అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా ప్రస్తుత అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌గౌడ్, హైకోర్టు న్యాయవాది ఆళ్లగడ్డకు చెందిన గోగిశెట్టి నరసింహారావు, జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసీరెడ్డి, సీనియర్ న్యాయవాది, మాజీ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రామచంద్రరావు, సివిల్ సప్లైస్ డైరెక్టర్ మహేష్‌నాయుడు, కాకరవాడ చిన్న వెంకటస్వామి, భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి, మాజీ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ఏవీ సుబ్బారెడ్డితో పాటు మరో ఇద్దరు దరఖాస్తు చేసుకున్నారు. ఊహించని రీతిలో 12మంది అధ్యక్ష స్థానానికి దరఖాస్తు చేసుకోవడంతో త్రీమెన్ కమిటీ సభ్యులు సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ఈ క్రమంలో బలమైన పోటీ మాత్రం గోగిశెట్టి నరసింహారావు, ఎన్ఎండీ ఫిరోజ్, రాజశేఖర్‌గౌడ్, ధర్మవరం సుబ్బారెడ్డి, ఏవీ సుబ్బారెడ్డి, తులసీరెడ్డి, రామచంద్రరావు మధ్య నెలకొంది. మొత్తం మీద దరఖాస్తులను స్వీకరించిన త్రీమెన్ కమిటీ ముగ్గురి పేర్లను అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తున్నట్లు తెలియజేశారు.

స్థలం కబ్జాపై విచారణ

- సీఎం చంద్రబాబుకు గుట్టపాడు సర్పంచ్ ఫిర్యాదు
- కలెక్టర్ ఆదేశాలతో కదిలిన రెవెన్యూ యంత్రాంగం

6

11 మంది సీఐలు బదిలీ

6

సిరుల జాజి

- కిలో పూలు రూ.700

వినాయక పండుగ సందర్భంగా జాజిపూల పంట రైతన్నకు సిరులు కురిపిస్తోంది. వారం రోజుల క్రితం సాధారణంగా ఉన్న ధర ఒక్కసారిగా పెరిగింది. మంగళవారం జాజిపూలు కేజీ రూ.700కు చేరగా మల్లెపూలు రూ.500కు చేరాయి. ఒకే రోజు 100 నుంచి 150 కేజీలకు పైగా జాజిపూలు కోతకు వచ్చాయి. కేజీ రూ.700 పలకడంతో దాదాపు లక్షల్లో రైతులకు ఆదాయం వచ్చింది. కౌలు రైతులకు కౌలు పోను రూ.లక్ష దాకా ఆదాయం వచ్చింది. నంద్యాల జిల్లా చాగలమర్రికి చెందిన మాబుషరీఫ్, ఫయాజ్, వలి, మరి కొందరు రైతులు మల్లెపూల సాగులో రికార్డు సాధించి ఆదర్శంగా నిలిచారు. పూల సాగులో రికార్డు సాధించి ఆదర్శంగా నిలిచారు. కష్టానికి తగ్గ ఫలితం వచ్చిందని కౌలు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

● చాగలమర్రి, ఆంధ్రజ్యోతి



6వ తరగతి ప్రవేశ పరీక్ష ఆన్‌లైన్‌కు నేడే చివరి తేదీ

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశ పరీక్షకు 27వ తేదీ చివరి తేదీ అని ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అర్హత కలిగిన విద్యార్థులు జవహర్ నవోదయలో 6వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. వివరాలకు జవహర్ నవోదయ విద్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

హోంగార్డు కుటుంబానికి బీమా చెక్కు అందజేత



బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్

నంద్యాల టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ యూనిట్‌లో పనిచేస్తున్న హోంగార్డు మాలిక్ రెండు నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మంగళవారం బాధిత కుటుంబానికి రూ.38లక్షల ప్రమాద బీమా చెక్కును వారి ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోంగార్డుకు డ్రైవింగ్ లైసెన్స్ ఉండడంతో శాలరీ ప్యాకేజీ కింద యాక్సిస్ బ్యాంకు వారు రూ.30లక్షలు, హోంగార్డు కూతురు మైనర్ కావడంతో మరో రూ.8లక్షలు కలిపి 38 లక్షలు అందజేశామన్నారు. ప్రతిఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కల్గి ఉండాలని కోరారు. దీంతో ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ఇలాంటి ప్రయోజనాలతో కుటుంబానికి కొంత మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హోంగార్డు కమాండెంట్ మహేష్‌కుమార్, డీఎస్పీ ప్రసాద్, యాక్సిస్ బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి నాటక పోటీలకు 'జగదేక సుందరి సామా' ఎంపిక

● 'శ్రీ వేంకటేశ్వర మహత్యం' కూడా...

కర్నూలు కల్చరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా నుంచి రెండు పద్యనాటకాలు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. టీజీవీ కళాక్షేత్రం కళాకారులు నటిస్తున్న 'జగదేక సుందరి సామా' చారిత్రక పద్య నాటకం రెండు జాతీయ నాటక పరిషత్తు పోటీలకు ఎంపిక కాగా 'శ్రీ వేంకటేశ్వర మహత్యం' కూడా పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 27 నుంచి అక్టోబరు 2 వరకు తెనాలిలోని కళల కాణాచి నాటక సంస్థ ఆధ్వర్యంలో, సినీ మాటల రచయిత బుర్రా సాయిమాధవ్ నిర్వహిస్తున్న పద్య నాటక పోటీలకు 'జగదేక సుందరి సామా' నాటకం ఎంపికైనట్లు తెలిపారు. తమ నాటకం తెనాలిలో సెప్టెంబరు 30న ప్రదర్శన ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అలాగే సెప్టెంబరు 5 నుంచి 9 వరకు అనంతపురంలో మైకెల్ అండ్ రెవెన్యూ సర్వీసెస్ ఆధ్వర్యంలో జరిగే పద్య నాటక పోటీలకు కూడా 'జగదేక సుందరి సామా' ఎంపికైనట్లు తెలిపారు. ఈ నాటకం సెప్టెంబరు 5న సాయంత్రం 6 గంటలకు అనంతపురంలోని శ్రీకృష్ణ కళామందిరంలో ప్రదర్శిస్తున్నట్లు పేర్కొన్నారు.

అదేవిధంగా టీజీవీ కల్చరల్ అకాడమీ నాటక సంస్థ ఆధ్వర్యంలో 'శ్రీ వేంకటేశ్వర మహత్యం' పౌరాణిక పద్య నాటకం సెప్టెంబరు 27 నుంచి అక్టోబరు 2 వరకు తెనాలిలో జరిగే పద్య నాటక పోటీలకు ఎంపికైనట్లు నాటక దర్శకుడు వీవీ రమణారెడ్డి మరో ప్రకటనలో తెలిపారు. ఈ నాటకం తెనాలిలో సెప్టెంబరు 27న ఉదయం 10:30 గంటలకు ప్రదర్శన ఉంటుందన్నారు.

కర్ణాటకకు తరలిస్తున్న ఎరువులు సీజ్



పట్టుబడ్డ ఎరువులపై కేసులు నమోదు చేస్తున్న వ్యవసాయ, పోలీసు అధికారులు

మంత్రాలయం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న ఎరువులను వ్యవసాయాధికారులు సీజ్ చేశారు. మండలంలోని మాధవరం చెక్‌పోస్టు వద్ద అక్రమంగా ఎమ్మిగనూరు నుంచి కర్ణాటకకు తరలిస్తున్న ఎరువులను ఎక్సైజ్ పోలీసులు సోమవారం రాత్రి పట్టుకున్నట్లు ఎమ్మిగనూరు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు, వ్యవసాయాధికారి జీరగణేష్ తెలిపారు. వివరాలు.. ఎమ్మిగనూరులోని వీరబ్రహ్మేంద్రస్వామి ట్రేడర్స్ నుంచి శంకప్పగౌడు వాహనంలో తీసుకెళ్తున్నారు. వ్యవసాయాధికారులు మాధవరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వాహనాన్ని తనిఖీ చేసి 110 బస్తాల ఎరువుల పట్టుకుని వాహనాన్ని సీజ్ చేశారు. ఇందులో డీఏపీ, 1919, 102626 రకంతో పాటు 40 బస్తాల యూరియాను సీజ్ చేసి మాధవరం గ్రామ సచివాలయంలో ఉంచారు. ఎరువులను, వాహనం మాధవరం పోలీస్ స్టేషన్‌లో ఉంచి జాయింట్ కలెక్టర్‌కు సరెండర్ చేశామని తెలిపారు. ఏఈవో తిరుమల్‌రెడ్డి, ఏఈవో విజయ్, వీఆర్‌ఏ పంపాపతి పాల్గొన్నారు.

స్థలం కబ్జాపై విచారణ

● సీఎం చంద్రబాబుకు గుట్టపాడు సర్పంచ్ ఫిర్యాదు

● కలెక్టర్ ఆదేశాలతో కదిలిన రెవెన్యూ యంత్రాంగం



కల్లూరు జిల్లా పరిషత్ పాఠశాలలో విచారణలో పాల్గొన్న కర్నూలు ఆర్డీవో బృందం

కల్లూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): కల్లూరు జడ్పీహెచ్‌ఎస్ స్థలం కబ్జాపై రెవెన్యూ అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఈ స్థలాన్ని కబ్జా చేశారని, విచారణ జరిపి చట్టపరంగా చర్యలు చేపట్టాలని ఓర్వకల్లు మండలం గుట్టపాడు సర్పంచ్ ఎన్.మోహన్‌రెడ్డి సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. జూలై నెలలో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'లో భాగంగా కర్నూలు జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం పాణ్యం నియోజకవర్గం టీడీపీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాటసాని అక్రమాలపై ఆయన సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. విచారణకు ఒక టీంను ఏర్పాటు చేసి నిజాలు నిగ్గు తేలుస్తామని హామీ ఇచ్చారు. ఈఅంశంపై కలెక్టర్ ఆదేశాల మేరకు కర్నూలు ఆర్డీవో కార్యాలయ ఏవో వేణుగోపాల్, కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులుతో కలిసి పాఠశాల స్థలాన్ని మండల సర్వేయర్ సుధాకర్‌తో సర్వే చేయించారు. ఎంఈవో శ్రీనివాసులు పాఠశాల హెచ్ఎం. డీసీ హుసేని, నాల్గవ పట్టణ సీఐ, వీఆర్వోలు మహేశ్వరరెడ్డి, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

వరదల్లో రికార్డులు కొట్టుకుపోయాయి

2007లో వచ్చిన వరదల్లో పాఠశాలలోని రికార్డులు కొట్టుకుపోయాయని ఎంఈవో శ్రీనివాసులు, హెచ్ఎం హుసేని లేఖలో ఇచ్చారని తహసీల్దార్ ఆంజనేయులు తెలిపారు. 2002లో కల్లూరు జడ్పీ స్కూల్ కోసం ఎకరా స్థలం అలాట్ చేసినట్లు సమాచారం ఉందన్నారు. సర్వే నెంబరు 442-ఏ, 444 రెండు సర్వే నెంబర్లలో ఉన్న పాఠశాల విస్తీర్ణాన్ని మండల సర్వేయర్‌తో కొలువగా 1.12 సెంట్లు ఉందన్నారు. కలెక్టర్ ఆదేశాలతో ప్రాథమిక విచారణలో భాగంగా సర్వే చేపట్టామన్నారు. పూర్తి స్థాయిలో స్కూల్ రికార్డులు పరిశీలించి అక్రమాలు ఏమైనా నిర్ధారణ అయితే చట్టపరంగా చర్యలకు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. పాఠశాల రికార్డుల కోసం జడ్పీ సీఈవోకు లేఖ రాస్తామన్నారు.

టీడీపీ నేత ఔదార్యం

● జడ్పీ స్కూల్ నిర్మాణానికి భూమి విరాళం

● అభినందించిన విద్యాశాఖ అధికారులు

ఆలూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత తెలుగు రైతు కమిటీ రాష్ట్ర కార్యదర్శి సి. నారాయణరెడ్డి ఔదార్యం చాటారు. ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి నాలుగెకరాల భూమిని విరాళంగా ఇచ్చారు. ఆలూరు మండలం ముద్దనగేరి గ్రామానికి జడ్పీ పాఠశాల మంజూరైంది. ప్రభుత్వ స్థలం లేకపోవడంతో అదే గ్రామానికి చెందిన నారాయణరెడ్డి తన సొంత పొలం నాలుగెకరాల భూమిని విరాళంగా పాఠశాల నిర్మాణం కోసం ప్రకటించారు. మంగళవారం గ్రామంలో సమగ్రశిక్ష ప్రాజెక్టు డీఈఈ విష్ణువర్ధన్‌రెడ్డి, ఆలూరు ఎంఈవో 2 చిరంజీవిరెడ్డితో కలసి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థలదాత నారాయణరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో జడ్పీ పాఠశాల లేక పోవడంతో విద్యార్థులు పక్క గ్రామాలకు వెళ్లి చదువుకోవడానికి ఇబ్బందులు పడేవారన్నారు. తమవంతుగా పాఠశాల నిర్మాణానికి స్థలం విరాళం ఇస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే స్థలాన్ని పాఠశాల పేరుమీద రిజిస్ట్రేషన్ చేసి అప్పగిస్తామన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న సమగ్ర శిక్ష ప్రాజెక్టు జిల్లా డీఈఈ విష్ణువర్ధన్‌రెడ్డి

విద్యాశాఖ అధికారులు, సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, గ్రామస్థులు తదితరులు అభినందించారు.

తప్పుల తడకగా పాసు పుస్తకాలు



● సరిదిద్దేందుకు సిద్ధమైన కూటమి ప్రభుత్వం

● రాజముద్రతో అందుబాటులోకి రానున్న పాసు బుక్కులు

● గత ప్రభుత్వ విధానాలతో ఇబ్బందుల్లో రైతులు

కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో ఇచ్చిన రైతు పాసు పుస్తకాలు తప్పుల తడకగా ఉన్నాయి. వీటిని సరిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. రైతులకు ఎవరి బొమ్మలు లేకుండా రాజముద్రతో పాసు పుస్తకాలు పంపిణీ చేసేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాకు దాదాపు రెండున్నర లక్షల పాసు పుస్తకాలు ఆయా మండలాల తహసీల్దార్లకు చేరాయి. ఆగస్టు 15 నుంచి వీటిని రైతులకు పంపిణీ చేసేందుకు కూటమి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అయితే.. పాసు పుస్తకాల్లో వివరాలు తప్పుల తడకగా ఉండటంతో వాటిని సరిదిద్దిన తర్వాతనే రైతులకు అందించాలని రెవెన్యూ శాఖ అధికార యంత్రాంగం రైతులకు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని వాయిదా వేశారు. గత ప్రభుత్వంలో నాటి సీఎం వైఎస్ జగన్ ఫొటోతో ఇచ్చిన పాసు పుస్తకాలపై రైతుల నుంచి తీవ్ర అభ్యంతరాలు వచ్చాయి. దీంతో కూటమి ప్రభుత్వం ఆ పాసు పుస్తకాలను రద్దు చేసింది. రాజముద్రతో పాసు పుస్తకాలను పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టింది. గత వైసీపీ పాలనలో కేటాయించిన సంయుక్త ఎల్‌పీఎం సంఖ్యలు ఏ మాత్రం మార్పులు లేకుండా చాలా పుస్తకాల్లో ఉండటం రైతులకు తలనొప్పిగా మారింది. అవి ఇక వద్దని ప్రతి రైతుకు వారి పొలాలకు సరైన సరిహద్దులు నమోదు చేసిన తర్వాతనే అందజేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

అప్పట్లో ఉమ్మడి జిల్లాకు..

వైసీపీ పాలనలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించి మూడు విడతల్లో భూముల పొలాలను సర్వే చేశారు. ఆ సర్వే ఆధారంగా 18,514 జాయింట్ ఎల్‌పీఎం నెంబర్ల పరిధిలో 1,37,979 మంది రైతుల ఖాతాలను చేర్చారు. కర్నూలు జిల్లాలో 252 గ్రామాల్లో సర్వే చేయగా.. 21,968 జాయింట్ ఎల్‌పీఎం నెంబర్లు పరిధిలో 61,817 మంది రైతుల ఖాతాలు ఉన్నాయి. నలుగురైదుగురు రైతులకు ఒకే ఎల్‌పీఎం నెంబరును కేటాయిస్తూ పాసు పుస్తకాలు జారీ చేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

రైతుల ఇబ్బందులను గుర్తించి..

కూటమి ప్రభుత్వం రైతుల ఇబ్బందులను గుర్తించి మళ్లీ సబ్ డివిజన్లను ఏర్పాటుచేసి వారి పొలాలకు సంబంధించి ఒకే సబ్ డివిజన్ పరిధిలో ఒకే ఖాతాను ఇచ్చి పొలం వివరాలను నమోదు చేస్తూ పాసు పుస్తకాలు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం తహసీల్దార్ల కార్యాలయాల్లో ప్రభుత్వం నుంచి అందిన పాసు పుస్తకాల్లో తప్పు ఒప్పులను సరి చేసే పనుల్లో యంత్రాంగం అంతా నిమగ్నమై ఉన్నారు. ఈ నెలాఖరు నాటికి పూర్తి చేసి సరైన వివరాలతో రైతులకు పాసు పుస్తకాలను అందించడం జరుగుతుందని డీఆర్వో వెంకటరమణమ్మ తెలిపారు.

నగరాభివృద్ధికి సహకరించాలి

● జాయింట్ కలెక్టర్ నవ్య



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవ్య

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నగరపాలక పరిధిలోని దామోదరం సంజీవయ్య కూడలి నుంచి కేవీఆర్ గార్డెన్ వరకు రహదారి విస్తరణలో ప్రభావితమయ్యే ఆస్తి యజమానులు నగరాభివృద్ధికి సహకరించాలని జాయింట్ కలెక్టర్ బి.నవ్య అన్నారు. మంగళవారం చెక్‌పోస్టు సమీపంలోని దేవి ఫంక్షన్‌హాలులో 82మంది ప్రభావిత ఆస్తి యజమానులతో కార్పొరేషన్ కమిషనర్ పి.విశ్వనాథ్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ నగరానికి భవిష్యత్తు రవాణా సౌకర్యాలు మెరుగుపడటానికి రహదారి విస్తరణ అత్యవసరమన్నారు. త్వరితగతిన పనులు ప్రారంభించాలని ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఎవరూ నష్టపోకుండా ఆస్తులు కోల్పోతున్నవారికి టీడీఆర్ బాండ్ల రూపంలో, భవనాలకు నగదు రూపంలో తగిన పరిహారం అందిస్తున్నామన్నారు. ఇప్పటికే కొందరికి టీడీఆర్ బాండ్లు అందజేశామని, మరి కొందరికి త్వరలోనే అందిస్తామని జేసీ తెలిపారు. మెరుగైన రవాణా, ట్రాఫిక్ నియంత్రణకు ప్రజలందరూ సహకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, డీసీపీ వెంకటరమణ, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ అంజాద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

గుండ్రేవులపై సీఎం సానుకూలం..!

● చంద్రబాబుకు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి వినతి

కర్నూలు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర నదిపై 20 టీఎంసీల సామర్థ్యంలో గుండ్రేవుల జలాశయం నిర్మించాలని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి సీఎం చంద్రబాబుకు వినతి పత్రం ఇచ్చారు. సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. జిల్లా పశ్చిమ ప్రాంతం తాగు, సాగునీటి అవసరాలతో పాటు కర్నూలు నగరం తాగునీటి అవసరాలకు శాశ్వత పరిష్కారం గుండ్రేవుల జలాశయం నిర్మాణం ఒక్కటే మార్గమని, ఈ ప్రాజెక్టును మంజూరు చేయాలని అభ్యర్థిస్తూ ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబును కలసి వినతిపత్రం అంజేశారు. సీఎం ఈ ప్రాజెక్టుపై సానుకూలంగా ఉన్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఇదే అంశంపై ఈ నెల 18న కేంద్ర జలవనరుల శాఖకు ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి లేఖ రాసినట్లు తెలిపారు.

ఉల్లి కొనుగోళ్లపై విజిలెన్స్ విచారణ

కర్నూలు క్రైం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో ఉల్లి కొనుగోళ్లపై ఇటీవల చోటు చేసుకున్న పరిణామాలపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. విజిలెన్స్ సీఐ పవన్ కిశోర్ ఆధ్వర్యంలో సిబ్బంది మార్కెట్ యార్డుకు వెళ్లి విచారించారు. కొంతమంది ట్రేడర్స్ ఉల్లి కొనుగోళ్లకు ముందుకు రాకపోవడంపై రైతులు ఆందోళన చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ ట్రేడర్స్‌కు ఉన్న లైసెన్సులు, ఇన్‌కంట్యాక్స్ పత్రాలను విజిలెన్స్ అధికారులు పరిశీలించారు. కొంత మంది ట్రేడర్స్‌కు లైసెన్సులు లేకపోవడం, వారు ఎలాంటి ఇన్‌కం ట్యాక్స్ ఫైల్ చేయడం లేదనే విషయాలు విజిలెన్స్ విచారణలో వెలుగులోకి వచ్చాయి. అలాగే మహారాష్ట్ర నుంచి కొంత ఉల్లి ఉత్పత్తులను దిగుమతి చేసుకుని గోడౌన్‌లో భద్రపరిచినట్లుగా గుర్తించారు. తాము కొనుగోలు చేసిన ఉల్లిని విక్రయించుకునేందుకు బయటి నుంచి వచ్చిన ఉల్లిని కొనడంలేదని విజిలెన్స్ అధికారులు నిర్ధారణకు వచ్చారు. ఈ నేపథ్యంలో సెక్రటరీ జయలక్ష్మితో సమావేశమై పలు విషయాలపై ఆరా తీశారు. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని విజిలెన్స్ సీఐ పవన్ కిశోర్ తెలిపారు.

విఘ్నాలు తొలిగి విజయాలు చేకూరాలి

● వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన అధికారులు

కర్నూలు క్రైం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికి విఘ్నాలు తొలగి విజయాలు చేకూరాలని కర్నూలు కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఎంపీ బస్తిపాటినాగరాజు ఆకాంక్షించారు. మంగళవారం ఆయన జిల్లా ప్రజలకు వారు వినాయచవితి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం వినాయక చవితిని ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. కర్నూలు జిల్లా మతసామరస్యానికి ప్రతీక, కులమతలకు అతీతంగా వేడుకలను జరుపుకోవాలని సూచించారు.

ప్రశాంతంగా సర్టిఫికెట్ల పరిశీలన

కర్నూలు క్రైం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): సివిల్, ఏపీఎస్‌పీ కానిస్టేబుళ్ల ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ ప్రశాంతంగా సాగింది. జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో సోమవారం సివిల్ కానిస్టేబుల్స్‌కు, మంగళవారం ఏపీఎస్‌పీ కానిస్టేబుల్ అభ్యర్థులకు వెరిఫికేషన్ నిర్వహించినట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. సివిల్స్, ఏపీఎస్‌పీ విభాగాలకు మొత్తం 643 మంది అభ్యర్థులుగానూ 617 మంది హాజరయ్యారని, 26 మంది గైర్హాజరైయారని తెలిపారు. అడిషినల్ ఎస్పీలు హుస్సేన్ పీరా, కృష్ణమోహన్, డీపీవో ఏవో విజయలక్ష్మి, ఆర్ఐలు జావేద్, సోమశేఖర్ నాయక్, డీపీవో సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

పర్యావరణహితం

● ఆదర్శం 'కొండవీటి గణేశ్'

● 34 ఏళ్లుగా పర్యావరణ రక్ష విగ్రహాల ఏర్పాటు



ఎమ్మిగనూరు పట్టణలోని కొండవీటి ప్రాంతంలో వింజామర ఈకలు, పూసలు, రుద్రాక్షలతో తయారు చేసిన మారుతి వినాయకుడు

ఎమ్మిగనూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వచ్చిందంటే అందరి చూపు ఎమ్మిగనూరు కొండవీటి ప్రాంతంలోని బాల వినాయక యువ మండలి వైపే ఉంటుంది. ఈ ఏడాది ఎలాంటి వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారనే ఆసక్తి పట్టణవాసుల్లో ఉంటుంది. ఎవరూ ఊహించని రీతిలో వివిధ రకాల పూజాసామగ్రితో వినూత్నంగా 34 ఏళ్లుగా ఏర్పాటు చేస్తున్నారు. పర్యావరణ రహితంగా ప్రతి ఏడాది వివిధ రకాల వినాయక విగ్రహాలను ఏర్పాటు చేస్తూ ఎమ్మిగనూరు ప్రాంతంలో ప్రత్యేకతను చాటుకుంటున్నారు. బాలవినాయక యువ మండలి నిర్వాహకులు తెలుగు రాముడుతో పాటు మరికొంతమంది తమ సొంత నిధులతో పూజా సామగ్రితో రూ.లక్షలు వెచ్చించి విగ్రహాలను ఏర్పాటు చేస్తూ వస్తున్నారు. అంతేగాక మండలి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ భక్తి భావంతో పాటు సేవా భావాన్ని చాటుకుంటున్నారు. ఈ ఏడాది కూడా రూ.3 లక్షలు వెచ్చించి మంత్రాలయం, శ్రీశైలం, మహానంది ప్రాంతాలనుంచి వింజామర ఈకలు, అయ్యప్ప ధారణ పూసలు, రుద్రాక్షలు తీసుకొచ్చి మండలికి చెందిన రఘువీర, బండాశేఖర్, అశోక్‌లు రెండు నెలలు శ్రమించి మారుతి వినాయకుడి విగ్రహాన్ని రూపొందించారు. వినాయక చవితి సందర్భంగా మొదటి రోజు, చివరి రోజు పేదమహిళలకు చీరలు, దివ్యాంగులకు దుస్తులు పంపిణీ చేయనున్నారు.

ప్రతి ఏటా విభిన్నంగా

ప్రతిఏడాది ఏదో ఒక పూజా సామగ్రితో వినాయక విగ్రహాన్ని తయారు చేస్తున్నాం. 34 ఏళ్లుగా మా వినాయక మండలి సభ్యుల సహకారంతో వినూత్నంగా ఏర్పాటు చేస్తు పట్టణంలో ప్రత్యేకత చాటుకుంటున్నాం. గణేశ్ ఉత్సవాల్లో సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. 500 మంది మహిళలకు చీరలు, దివ్యాంగులకు, సాధువులకు దుస్తులు, పేద విద్యార్థులకు పుస్తకాలు అందిస్తూ వస్తున్నాం.

\- రాముడు, బాలవినాయక యువమండలి

● 34 ఏళ్లుగా వినూత్న రీతిలోనే...

కొండవీటి బాల వినాయక యువ మండలి ఆధ్వర్యంలో 1992నుంచే వినూత్న రీతిలో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. 33ఏళ్లుగా విగ్రహాలను ఏర్పాటు చేస్తున్న ఎప్పుడు కూడా ప్లాస్టరాఫ్ పారిస్, కెమికల్ రంగులను వాడకుండా కేవలం మట్టి, పూజాసామగ్రిని మాత్రమే వినియోగించి విగ్రహాలను రూపొందిస్తున్నారు. 1992లో నవదాన్యాలతో తయారు చేసిన వినాయకుడు, 1993లో శనగపప్పులతో, 1994లో నాట్య వినాయకున్ని ప్రతిష్ఠించగా 1995లో వక్కలతో తయారు చేసిన వినాయకుడు, 1996లో గోడంబి, ద్రాక్షలతో, 1997లో వెలగకాయలతో, 1998లో బాదంపపతో, 1999లో ఎండు ఖర్జూరంతో, 2000లో నవధాన్యాలతో, 2001లో రుద్రాక్షమాలతో, 2002లో పసుపు కొమ్ములతో, 2003లో అనుముల విత్తనాలతో, 2004లో తులసి పూసలతో, 2005లో నవరత్నాలు, పూసలతో, 2006లో కాని పాక వినాయకుడు, 2007లో పచ్చి వక్కలతో, 2008లో ముత్యాల పూసలతో, 2009లో మొక్కజొన్నలతో, 2010లో కస్తూరి పూసలతో, 2011లో సోయాబిన్ విత్తనాలతో తయారు చేశారు. 2012లో బాదం విత్తనాలతో, 2013లో దశావతార వినాయకుడు, 2014లో రుద్రాక్షలు, తులసి పూసలతో తయారు చేసిన వినాయక విగ్రహం, 2015లో తులసీపూసలు, రుద్రాక్షలతో తయారుచేసిన దత్తాత్రేయ వినాయకుడు, 2016లో గోమేధిక, చక్రాంతికలు, కమలాక్షీ పూసలతో శివపుత్ర గజకర్ణి వినాయకుడు, 2017లో గజేంద్ర మోక్షవినాయకుడు, 2018 శంకములతో తయారు చేసిన సుబ్రహ్మణ్య వినాయకుడు, 2019 బాదావికాయలతో తయారు చేసిన శ్రీకృష్ణ వినాయకుడు, కరోనా సమయంలో 2020.2021లో సమీపంలోని ఆలయంలో చిన్నవిగ్రహాలు ప్రతిష్ఠించారు. 2022 కమలాక్షి పూసలు, అడవిటెంకాలయలతో అయ్యప్ప వినాయకుడు విగ్రహాన్ని, 2023లో తులసి మాల, పువ్వు రుద్రాక్షలు, ఆముదాలు కుసుమలతో బ్రహ్మా, విష్ణు,మహేశ్వర విగ్రహాన్ని ఏర్పాటు చేయగా 2024లో 70 కిలోల రుద్రాక్షలతో ఆకర్షణీయంగా నరసింహ వినాయక విగ్రహన్ని ఏర్పాటు చేశారు. బుధవారం వినాయకచవితి సందర్భంగా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలుగు రాముడు, రఘువీర, ఆశోక్, సాయి,గణేష్, బండా శేఖర్ తెలిపారు.

గడువు పెంచారు..!

● 29 వరకు బార్ల నిర్వహణకు దరఖాస్తులు

కర్నూలు అర్బన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): బార్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం గడువును పెంచింది. ఈనెల 29 వరకు పొడిగిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని 26 బార్లకు సంబంధించి కర్నూలులో 12, ఆదోనిలో 13 మంది మాత్రమే దరఖాస్తు చేశారు. ఎమ్మిగనూరు, గూడూరు సెంటర్ల నుంచి ఒక్కరు కూడా దరఖాస్తు చేసేందుకు ముందుకు రాలేదు. రాష్ట్ర స్థాయిలో నూతన బార్ పాలసీని యాజమాన్యాలు వ్యతిరేకిస్తున్న తీరుపై ప్రభుత్వం కూడా సాయంత్రం వరకు వేచి చూసింది. చివరి ఆరగంటలో ఈనెల 29 వరకు గడువు పొడిగిస్తున్నట్లు ఆదేశాలు ఇచ్చింది. 139 మంది బార్ల దరఖాస్తుల కోసం ఎన్‌రోల్‌మెంట్ చేసుకున్నప్పటికి పూర్తి స్థాయిలో ప్రక్రియను పూర్తి చేసేందుకు ఆసక్తి చూపలేదు. మంగళవారం సాయంత్రంలోపు పూర్తి స్థాయిలో బార్లకు దరఖాస్తులు వస్తాయని ఆశించిన ఎక్సైజ్ శాఖ ఒక్కసారిగా డీలా పడింది. బార్ల యాజ్యమాన్యాలు మాత్రం తాము దరఖాస్తులు వేసేది లేదని, ప్రభుత్వం మరో నెల రోజులు పాత పాలసీనే కొనసాగించే అవకాశం ఉందని చర్చించుకుంటూ కనిపించారు.

11 మంది సీఐలు బదిలీ

కర్నూలు క్రైం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కర్నూలు రేంజ్ పరిధిలో 11 మంది సీఐలను బదిలీ చేస్తూ రాయలసీమ రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సీఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఎం.తిమ్మారెడ్డి	డీఎస్‌బీ-2, అన్నమయ్య	ప్రొద్దుటూర్ వన్‌టౌన్ యూపీఎస్
బి.రామకృష్ణారెడ్డి	ప్రొద్దుటూరు వన్‌టౌన్	రిమ్స్ యూపీఎస్
వి.సీతారామిరెడ్డి	రిమ్స్ యూపీఎస్	పులివెందుల యూపీఎస్
ఎస్.చాంద్‌బాషా	పులివెందుల యూపీఎస్	సోషల్ మీడియా అండ్ సైబర్ క్రైం సెల్, నంద్యాల
ఎస్.వంశీధర్	సోషల్ మీడియా అండ్ సైబర్ క్రైం సెల్, నంద్యాల	ఖాజీపేట్ యూపీఎస్
ఆర్.మోహన్	ఖాజీపేట్ యూపీఎస్	వీఆర్, కడప
జే.రమేష్ కుమార్	ఆదోని ట్రాఫిక్ పీఎస్	సీసీఎస్-3, కర్నూలు
జి.ఇబ్రహీం	సీసీఎస్-3, కర్నూలు	డీటీసీ, కర్నూలు
టి.అబ్దుల్ గౌస్	డీటీసీ, కర్నూలు	ఆదోని ట్రాఫిక్ పీఎస్
ఎం.నాగభూషణ్	సీకే దిన్నె యూపీఎస్	ప్రొద్దుటూరు రూరల్
బి.బాల మద్దిలేటి	ప్రొద్దుటూరు రూరల్ సర్కిల్	సీకే దిన్నె యూపీఎస్


బాలిక మృతదేహం వద్ద అధికారులు

డెంగీతో బాలిక మృతి

• వెల్దుర్తికి వచ్చిన అధికారులు

వెల్దుర్తి టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఓ బాలిక డెంగీతో మృతి చెందడంతో కలకలం రేగింది. మండల కేంద్రంలోని 6వ వార్డులో నివాసముంటున్న సీపీఐ నాయకుడు టి.కృష్ణ, సునీత కుమార్తె మోక్షిత (5)కు గత వారం జ్వరం రావడంతో తల్లిదండ్రులు స్థానిక పీహెచ్‌సీలో వైద్యం చేయించారు. డెంగీ లక్షణాలను గమనించిన వైద్యులు కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లాలని సూచించడంతో ఈ నెల 22న కర్నూలుకు తరలించారు. కాగా బాలిక ఆసుపత్రిలో కోలుకోలేక మంగళవారం మృతి చెందింది. బాలిక శారద కాన్వెంట్ స్కూల్‌లో రెండో తరగతి చదువుకుంటోంది. తమ్ముడు హేమంత్ ఉన్నారు. కూతురి మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి,

అప్రమత్తమైన అధికారులు..

బాలిక డెంగీతో మృతిచెందడంతో పంచాయతీ, వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తమయ్యారు. బాలిక ఇంటి పరిసరాల్లో పారిశుధ్య పనులు చేయించి, దోమల మందును పిచికారీ చేయించారు. విషయం తెలుసుకున్న పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, వైసీపీ మండల అధ్యక్షులు బొమ్మన రవిరెడ్డి, జడ్పీటీసీ దారిపోగు సుంకన్న బాలికకు నివాళి అర్పించారు. అనంతరం పంచాయతీ సిబ్బంది, అధికారులతో సమావేశం నిర్వహించి, పారిశుధ్య విషయంలో అశ్రద్ధ చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీఎంహెచ్‌వో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో వార్డులను పరిశీలించి, రోగులతో మాట్లాడి వైద్యసేవల వివరాలను తెలుసుకున్నారు.

పరామర్శించిన డీఎంహెచ్‌వో, ఆర్డీవో, డీపీవో

బాలిక మృతితో డీఎంహెచ్‌వో శాంతికళ, ఆర్డీవో సందీప్ కుమార్, డీపీవో భాస్కర్ వెల్దుర్తి వచ్చి బాలిక మృతి కారణాలను అడిగి తెలుసుకున్నారు. డీఎల్‌పీవో లక్ష్మి, తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ, డిప్యూటీ ఎంపీడీవో రవికిషోర్, ఆర్ఐ మంజుల, సెక్రటరీ లక్ష్మీనాథ్, ఎస్‌బీ కానిస్టేబుల్ సుకుమార్, టీడీపీ నాయకులు బలరాంగౌడు, మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడ్ ఉన్నారు.

నలుగురు చిన్నారులు అదృశ్యం

• సమీప బంధువుపైనే అనుమానం
• రంగంలోకి దిగిన పోలీసులు

కోడుమూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఒకరిద్దరు కాదు ఏకంగా నలుగురు చిన్నారులు అదృశ్యమైన ఘటన పట్టణంలో సంచలనం సృష్టిస్తుంది. ఈఘటన ఆలస్యంగా వెలుగు చూసినట్లు ఎస్ఐ డి.వై స్వామి తెలిపారు. వివరాలు.. కోడుమూరు పట్టణానికి చెందిన చరణ్, అనిల్ అనే ఇద్దరు మైనర్లు. వీరితో పాటు మరో ఇద్దరు బాలికలు అదృశ్యమైన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఇదిలా ఉంటే వీళ్లతో పాటు చిన్నారుల సమీపం బంధువు రాజు అనే వ్యక్తి కూడా కనిపించకుండా పోవడంపై చిన్నారుల తల్లిదండ్రుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీళ్లంతా ఈనెల 19న రాత్రి 7గంటల నుంచి కనిపించకుండా పోవడంతో పలు అనుమానాలకు దారి తీస్తున్నాయి. రాజు అనే వ్యక్తి భార్య, పిల్లలను వదిలేసి కడప జిల్లా నుంచి రెండు నెలల కిందట కోడుమూరుకు వచ్చాడు. బంధువులు ఆశ్రయం ఇవ్వడంతో స్థానికంగా ఓ గుజరీ షాపులో పనిచేస్తున్నాడు. అతడికి ఇటీవల కాలంలోనే ఓ మహిళతో వివాహేతర సంబంధం ఏర్పడిందని బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ 19న రాజు, వివాహేతర మహిళ కలిసి మాయమాటలు చెప్పి చిన్నారులను తీసు కెళ్లినట్లు తల్లిదండ్రులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు రంగంలోకి దిగారు. వీళ్ల ఆచూకీ కోసం రెండు పోలీసు బృందాలను ఏర్పాటుచేసి గాలింపు చర్యలు చేపట్టామని, త్వరలోనే పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు.

కాల్వలో పడి వ్యక్తి మృతి

బనగానపల్లె, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఎస్సార్బీసీ కాల్వలో పడి ఓ రైతు మృతిచెందాడు. ఈఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకున్నట్లు ఎస్ఐ దుగ్గిరెడ్డి తెలిపారు. వివరాలు.. బత్తులూరుపాడు గ్రామానికి చెందిన రైతు కురువ రామనాథ్(35) రెండు రోజుల క్రితం పొలంలో వ్యవసాయ పనులు ముగిం చుకు న్నాడు. స్నానం చేసేందుకు ఎస్సార్బీసీ కాల్వలో వద్దకు వెళ్లాడు. ప్రమాదశాత్తు కాలుజారి కాలువలో పడ్డాడు. బంధువులు, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం రాళ్లకొత్తూరు సమీపంలో రామనాథ్ మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

హత్య కేసులో వ్యక్తికి జీవిత ఖైదు

• తీర్పు ఇచ్చిన జిల్లా ప్రధాన న్యాయాధికారి

కర్నూలు లీగల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామంలో ఓ వ్యక్తిని హత్య చేసిన కేసులో నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.6వేలు జరిమానా విధిస్తూ కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. నన్నూరుకు చెంది నిందితుడు బోయ తోట శివ(35)పై పలు క్రిమినల్ కేసులు ఉండటంతో ఆయనపై గతంలో రౌడీషీట్‌ను పోలీసులు తెరిచారు. ఈ నేపథ్యంలో 2017 నవంబరు 19వ తేదీన సాయంత్రం ఓర్వకల్లు చెందిన సలాంబాషా ఒక హోటల్ వద్ద టీ తాగుతుండగా.. నిందితుడు అక్కడకు వచ్చి అతడి తలపై ఉన్న టోపీని లాగేసి అనుచితంగా ప్రవర్తించాడు. సలాం బాషా సోదరుడు అడ్డుకుని ప్రశ్నించడంతో శివ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. తిరిగి కొద్దిసేపటికే శివ తన ఇంట్లోని కత్తిని తీసుకువచ్చి టీహోటల్ వద్ద ఉన్న సలాంబాషాను కత్తితో ఇష్టమొచ్చినట్లు పొడిచి తీవ్రంగా గాయపరిచాడు. అక్కడే ఉన్న సలాంబాషా సోదరుడు, మరి కొంత మంది గ్రామస్థులు గాయపడిన సలాంబాషాను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సలాంబాషా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు హతుడి సోదరుడు ఆజాంశాలీ ఖాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఓర్వకల్లు పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి కర్నూలు అర్బన్ పోలీస్‌స్టేషన్ సీఐ నాగరాజుయాదవ్ నిందితుడు తోట శివను అరెస్టు చేశారు. కోర్టులో నిందితుడిపై నేరం రుజువు కావడంతో యావజ్జీవ కారాగార శిక్ష, రూ.6వేలు జరిమానా విధిస్తూ న్యాయాధికారి జి.కబర్ది తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ వెంకటరెడ్డి వాదించారు.


శివను జైలుకు తరలిస్తున్న పోలీసులు

మిస్టరీగా వెంకటేష్ మృతి

• కుళ్లిపోయిన మృతదేహం, పరారైన భార్య, కూతురు
• కొడుకు మృతిపై తల్లి అనుమానాలు
• న్యాయవిచారణ జరపాలని పోలీసులకు ఫిర్యాదు


వెంకటేశ్(ఫైల్)

మద్దికెర ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలోని మెయిన్‌బజారుకు చెందిన ముగతి వెంకటేశ్ (54) మృతి మిస్టరీగా మారింది. భార్య, కూతురు మూర్ఛవ్యాధితో చనిపోయాడని చెబుతుండగా. మృతుడి తల్లి మాత్రం అనుమానాలు వ్యక్తం చేస్తూ మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ విజయ్‌నాయక్ తెలిపారు.

వివరాలు.. మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో ముగతి వెంకటేశ్, భార్య సరస్వతి, కూతురు కుసుమతో కలిసి ఉంటున్నాడు. అతడికి మూర్ఛ వ్యాధి ఉంది. నాలుగు రోజుల క్రితం ఇంటి ఆవరణలో వెంకటేష్ పడిపోయి మృతిచెందినా భార్య కూతురు ఎవరికీ సమాచారం ఇవ్వలేదు. మృతదేహాన్ని ఇంటి బ యటే పడే శారు. నాలుగు రోజులుగా అక్కడే పడి ఉండటంతో వెంకటేశ్ మృత దేహం కుళ్లిపోయి దుర్వాసన రావడంతో భార్య సరస్వతి, కూతురు కుసుమ ఇల్లు వదిలి పారి పోయారు. పరిసర ప్రాంత ప్రజలు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి పరిశీలించగా అప్పటికే శవం కుళ్లిపోయింది. వెంకటేశ్ తల్లి ముగతి రామలింగమ్మ నా కుమారుడు వెంకటేశ్‌ను కోడలు సరస్వతి, కూతురు కుసుమ చంపే శారని ఆరోపిస్తు న్నారు. భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు ఉన్నా యని, నా కుమారుడు మెతక స్వభావం కలిగినవాడని తెలిపారు. భార్యాభర్తల గొడవలు పలుమార్లు పెద్దల సమక్షం లో రాజీ చేయడం కూడా జరిగిందన్నారు. శవాన్ని నాలుగు రోజుల పాటు ఇంటి ఆవర ణలో ఎలా పెట్టుకుంటారని ప్రశ్నించారు. నా కుమారుడు మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని, విచారణ జరిపి న్యాయం చేయాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంతకల్లుకు తరలించారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

స్థలం కొలతలు వాయిదా


ఇరువర్గాల వారితో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారులు, పోలీసులు

నందికొట్కూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని రోజులుగా వివాదంగా మారిన పట్టణంలో సీఎస్ఐ సంఘం సమాధుల తోట సర్వే వాయిదా పడింది. పట్టణంలోని సర్వే నెంబరు 407లో 0.75 సెంట్లు ఉన్న ప్రభు త్వ భూమిని నాడు సీఎస్ఐ చర్చికి సంబంధించిన సంఘం సమాధుల తోటకు ప్రభుత్వం కేటాయించింది. పక్కనే ఉన్న సర్వేనెం: 406లో 1.10 ఎకరాల్లో ముబారక్ రైస్ మిల్ ఓనర్లకు సంబంధించిన స్థలం ఉంది.

అయితే ముబారక్ రైస్ మిల్ ఓనర్లు తమ స్థలానికి దక్షిణం దిశలో రస్తా ఉందని, తమకు రస్తా చూపించాలని తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకున్నారు. అయితే సీఎస్ఐ సంఘం నాయకులు ప్రభుత్వం తమకు ఇచ్చిన 75 సెంట్ల భూమి పక్కన ఎలాంటి రస్తా లేదని, తమకు ఉన్న స్థలాన్ని సర్వే చేయాలని ఆర్డీవోకు వినతి పత్రం సమర్పించారు. ఆర్డీవో ఆదేశాలతో పోలీసులు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం సమక్షంలో రెవెన్యూ అధికారులు మంగళవారం సర్వే చేశారు. 407లోని స్థలాన్ని మాత్రమే సర్వే ఎలా చేస్తారని, 406లోని ముబారక్ రైస్ మిల్ స్థలాన్ని కూడా సర్వే చేయాలని సీఎస్ఐ సంఘం నాయకులు వ్యతిరేకించారు. దీంతో కొలతల ప్రక్రియ వాయిదా పడినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు.

'స్వచ్ఛమైన నీటితోనే ఆరోగ్యం'




మాట్లాడుతున్న శ్రీనివాసాచార్యులు

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛమైన నీటితోనే మంచి ఆరోగ్యం సాధ్యమని నంద్యాల పీఎస్ జోన్ నిర్వాహకుడు శ్రీనివాసాచార్యులు అన్నారు. మంగళవారం నం ద్యాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడు తూ నీటి నాణ్యతపై అనేక పరిశోధనలు జరిగాయన్నారు. మన శరీరంలోని బరువులో 70 నుంచి 80శాతం నీరు వివిధ రూపాల్లో ఉం టుందన్నారు. మనకు టెక్నాలజీతో పాటు నీటి కాలుష్యం రెండింతలు పెరిగిందన్నారు. కాలుష్యపు నీరు తాగడం వల్ల అనేక రోగాలు వస్తాయన్నారు. తమ ప్లాంట్ నుంచి ఆర్‌వో వాటర్ ప్యూరిఫయర్, ఆర్‌వో వాటర్ ప్యూరిఫయర్(కమర్షియల్)లు ఆధునిక టెక్నాలజీతో నీటిలో లవణ సాంద్రతను తగ్గించి, బ్యాక్టీరియాను అరికడతాయన్నారు. తమ వద్ద స్టీల్ ట్యాంక్‌లు, ఆర్‌వో వాటర్ ప్యూరిఫయర్స్, ఆర్‌వో వాటర్ ప్లాంట్స్, సోలార్ వాటర్ హీటర్స్ బూస్ట్ పంప్స్, ఆక్వాటెక్ ట్యాంక్స్, సీపీవీసీ పైపులు అందుబాటులో ఉన్నాయన్నారు.

మొదలైన చవితి సంబరాలు

- ఏర్పాట్లలో నిమగ్నమైన ఉత్సవ నిర్వాహకులు
- పూజా సామగ్రి కొనుగోలులో జనం


నంద్యాల మార్కెట్ యార్డులో గణపతి పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు

ఆత్మకూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వినాయక చవితిని పురస్కరించుకుని ఆత్మకూరు ప్రాంతంలో ఒక్కరోజు ముందుగానే చవితి సంబరాలు ఊపందుకున్నాయి. బుధవారం జరిగే వినాయకుడి పండుగను సంతోషంగా జరుపుకునేందుకు ఆయా మంటపాల నిర్వాహకులతో పాటు భక్తులు మంగళవారమే ఉత్సాహంగా ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ ఏడాది వినాయక చవితి సందర్భంగా ఆత్మకూరు పట్టణంలో సుమారు 35దాకా గణనాథులు కొలువుతీరనున్నారు. అదేవిధంగా చుట్టు పక్కల గ్రామాల్లో కూడా విగ్రహాల సంఖ్య అంచనాలకు మించి పెరిగాయి. అలాగే ఉత్సవాన్ని సంబరంగా జరుపుకునేందుకు మంటపాల నిర్వాహకులు పోటీపడుతున్నారు. ఆయా మంటపాల వద్ద కాషాయపు జెండాలు, విద్యుత్ అలంకరణతో సుందరంగా తీర్చిదిద్దారు. కాగా వినాయక ఉత్సవాన్ని పురస్కరించుకుని సంప్రదాయ బద్ధంగా వినాయకుడి పూజలో ఉపయోగించి గరిక గడ్డి, ఎలక్కాయలు, మొక్కజొన్న కంకులు, పుష్పాల తదితర పూజా సామగ్రిని కొనుగోలు చేసేందుకు గౌడ్ సెంటర్‌లో ప్రజలు పోటెత్తారు. అలాగే ఈ నెల 29న జరిగే నిమజ్జన మహోత్సవాన్ని వైభవం గా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

మట్టి విగ్రహాలు శుభప్రదం

చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మట్టి విగ్రహాలనే పూజించడం శుభప్రదమని కాకనూరు శ్రీశారద జ్ఞానపీఠాధిపతులు శివయోగేంద్రసరస్వతీ స్వామిజీ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక గౌడ్ సెంటర్‌లో ఆర్యవైశ్య మండలాధ్యక్షుడు శేగు కిరణ్ కుమార్ సహకారంతో భక్తులకు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విఘ్నేశుడి ఆశీస్సులతో ప్రజలందరు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ మాట్లాడు తూ.. మట్టి ప్రతిమలను పంపిణీ చేయడం అభినందనీయమ న్నారు. ఆత్మకూరు అర్బన్, రూరల్ సీఐలు రాము, సురేష్‌కుమార్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, ఎస్ఐ నారాయణరెడ్డి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నరహరి సత్యనారాయణ పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: వినాయక విగ్రహాల నిమజ్జనం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని జూపాడుబంగ్లా ఎస్ఐ మల్లికార్జున అన్నారు. మంగళవారం కేసీకాల్వవద్ద ఆయన పరిశీలించారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా బ్యారీకేడ్లు, విద్యుత్తుదీపాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసు కోవాలని గ్రామ పంచాయతీ అధికారులకు సూచించారు.

మహానంది: వినాయకుడు పర్యావరణ ప్రేమికుడు అని మహానంది మండల తహసీల్దార్ రమాదేవి తెలిపారు. మంగళవారం మహానందిలోని ఈశ్వర్‌నగర్ సచివాలయం ఆవరణలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ హైమవతి సహకారంతో మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమాన్ని గణేష్ కేంద్ర సమితి సభ్యులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తహసీల్దార్ రమాదేవి చేతుల మీదుగా మట్టి వినాయకుల విగ్రహాలను పంపిణీ చేయించారు.

నందికొట్కూరు: చవితి ఉత్సవాలకు పందిళ్లు సిద్ధమయ్యాయి. ఎక్కడికక్కడ ఉత్సవ కమిటీలు నవరాత్రుల పూజాధికాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. విద్యుద్దీపాలంకరణలు చేశారు. సర్వ విఘ్నాలను తొలగించే ఆదిదేవుడు గణపతి పూజకు ప్రజలు ఏర్పాట్లు చేసుకున్నారు. ఆయా ఉత్సవ కమిటీ సభ్యులు మేళతాళాలపై గణనాథులను మండపాలకు తరలించారు.

పగిడ్యాల: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో వినాయకులు కొలువుతీరేందుకు నిర్వాహకులు మండపాలను సిద్ధం చేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో 60కి పైగా విగ్రహాలు ఉండొచ్చని ఏఎస్ఐ సుబ్బరావు తెలిపారు.

కొత్తపల్లి: చవితి వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆత్మకూరు సీఐ సురేష్ కుమార్‌రెడ్డి సూచించారు. మంగళవారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ జయశేఖర్ ఆధ్వర్యంలో వినాయక ఉత్సవ విగ్రహాల కమిటీలతో సమావేశం నిర్వహించారు.మండలంలోని ఆయా గ్రామాల ఉత్సవ కమిటి నిర్వహకులు పాల్గొన్నారు.

వెలుగోడు: వెలుగోడు పట్టణంలో వినాయకచవితి పండుగను పురస్కరించుకొని గణపతి మండపాలను నిర్వాహకులు పోటాపోటీగా ఏర్పాటు చేస్తున్నారు. సెట్టింగులను ప్రత్యేక లైటింగులతో జనాలను ఆకర్షించే విధంగా తీర్చిదిద్దారు. అలాగే మట్టిబొమ్మలను వినియోగిస్తే పర్యావరణ పరిరక్షణ చేకూరుతుందని టీడీపీ నాయకులు అన్నారపు శేషిరెడ్డి, అబ్దుల్‌కలాం, బండ్ల శంకరరెడ్డి అన్నారు. మంగళవారం వెలుగోడు పట్టణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.

నంద్యాల కల్చరల్: నంద్యాల పట్టణంలోని టెక్కె మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన గణపతి పూజ సామాగ్రికి ప్రజలు విశేషంగా ఆసక్తి చూపి కొనుగోలు చేశారు. గ్రామీణప్రాంతాల నుంచి విక్రయం కోసం తీసుకొచ్చిన గరిక, అరటి ఆకులు, మామిడి ఆకులు, చెరకు గడలు, సీతాఫలం, బిల్వం, పూలు, పండ్లు తదితర పూజా సామగ్రిని కొనుగోలు చేశారు.


ఆత్మకూరులో పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న దృశ్యం


నందికొట్కూరు: గణనాథులను కొనుగోలు చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు


మహానంది: మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న తహసీల్దార్ రమాదేవి


కొత్తపల్లి: ఉత్సవ కమిటీ నిర్వాహకులతో మాట్లాడుతున్న సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి


వెలుగోడు: వినూత్నంగా వినాయక మండపం

ఏపీటీఎఫ్ పట్టణ నూతన కమిటీ ఏర్పాటు

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణ ఏపీటీఎఫ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. మంగ ళవారం కమిటీ ఎన్నికల అధికారి రామచంద్రా రెడ్డి, పరిశీలకుడు దస్తగిరిబాషా ఆధ్వర్యంలో పట్టణ కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా గాలయ్య, ప్రధాన కార్యదర్శిగా డీఎస్‌కే జానీబాషా, ఉపాధ్యక్షుడిగా జమాల్‌వలి, రామ్‌బాలాజీనాయక్, రిజ్వానకౌసర్, ఎస్ఎండీ షరీఫ్, ఓబులేసు, కార్యదర్శులుగా సరోజమ్మ, ఎంవి.రమణ, ఫయాజ్ఆలీ, శ్రీనివాసులు, శంకర్‌నాయుడులతో పాటు జిల్లా కౌన్సిలర్స్‌గా ఎన్ఎండీ నౌమాన్‌బాషా, దస్తగిరిబాషా, వసంతకుమారి, అనీఫ్, రాములమ్మ, ఫర్వీన్‌బానులను ఎంపిక చేశారు. అనంతరం వారిచేత జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి శివయ్య ప్రమాణం చేయించారు.

జీజీహెచ్‌లో పారిశుధ్య పనులు

నంద్యాల హాస్పిటల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని జీజీహెచ్‌లో మంగళవారం సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టారు. ఈనెల 24న కనిపించని స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర, పట్టించుకోని అధికారులు అనే శీర్షికన ఆంధ్రజ్యోతి పత్రికలో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.మల్లేశ్వరి జీజీహెచ్ శానిటరి సూపర్‌వైజర్ దృష్టికి తీసుకు పోవడంతో పరిశుభ్రం చేశారు.

సీఎం సహాయ నిధి పంపిణీ

మిడుతూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మిడుతూరు మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన మాదిరెడ్డి వెంకటరమణరెడ్డికి మంగళవారం ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.1.16.160 చెక్కును ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అందజేశారు. టీడీపీ సీనియర్ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, నాయకులు వెంగల్ రెడ్డి, సర్వోత్తమ రెడ్డి, రాముడు పాల్గొన్నారు.

నిబద్ధతతో పని చేసినవారికి పదవులు

(5వ పేజీ తరువాయి)


కార్యకర్తల నడుమ కూర్చున్న ఎన్ఎండీ ఫిరోజ్

ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ చైర్మన్, రాష్ట్ర పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరి పూల నాగరాజు మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు కూడా టీడీపీకి కార్యకర్తలే బలం అని కొనియాడారు. అనంతరం పార్లమెంట్ అనుబంధ, సాధికార కమిటీల కోసం వినతులు స్వీకరించారు. కొందరు అభిప్రా యాలను సైతం అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, మార్క్‌ఫెడ్ చైర్మన్ తులసీరెడ్డి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఏవీ సుబ్బారెడ్డి, టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు గౌరు వెంకటరెడ్డి, భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ హరిబాబు పాల్గొన్నారు.

అధికసంఖ్యలో తరలివచ్చిన నాయకులు

స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో తరలివచ్చారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి కార్యకర్తలు, నాయకులతో పాటు పదవుల ఆశావహులు చేరుకున్నారు. నియోజకవర్గాల వారీగా ఆశావహుల అభిప్రాయాలతో పాటు వినతు లను స్వీకరించారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. వివిధ పదవులకు సుమారు 220మంది ఆశావహులు వినతులు అంద జేసినట్లు తెలిసింది.

అధ్యక్ష పదవి కోసం పోటీ..

టీడీపీ అధ్యక్ష పదవి కోసం 12మంది(డజన్ మంది) దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. వీరిలో ప్రస్తుత అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌గౌడ్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసీరెడ్డి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, హైకోర్టు న్యాయవాది ఆళ్లగడ్డకు చెందిన గోగిశెట్టి నరసింహారావు, సీనియర్ న్యాయవాది, మాజీ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రామచంద్ర రావు, సివిల్ సప్లయ్ డైరెక్టర్ మహేష్‌నాయుడు (నందికొట్కూరు), చిన్న వెంకట స్వామి(ఎస్సీ), భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి, మాజీ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ఏవీ సుబ్బారెడ్డి, మరో ఇద్దరు ఉన్నట్లు తెలిసింది. ఉపాధ్యక్ష పదవి కోసం ముగ్గురు, జిల్లా ప్రధాన కార్యదర్శి కోసం ముగ్గురు దరఖాస్తు చేసుకున్నారని సమాచారం. ఇదిలా ఉండగా.. నంద్యాలకు చెందిన ఇద్దరు(గోవింద నాయుడు, రామక్రిష్ణ)వాల్మీకులు రాష్ట్ర పార్టీలో కార్యదర్శులుగా అవకాశం కల్పించాలని వినతులు అందజేశారని తెలిసింది.

జీజీహెచ్ వైద్యులపై ఎంపీ బైరెడ్డి అసహనం


వైద్యులపై అసహనం వ్యక్తం చేస్తున్న ఎంపీ బైరెడ్డి శబరి

నంద్యాల హాస్పిటల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని జీజీహెచ్ వైద్యులపై మంగళవారం నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి అసహనం వ్యక్తం చేశా రు. జీజీహెచ్‌ను ఎంపీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సదరం క్యాంప్‌నకు వచ్చే దివ్యాంగులకు పరీక్షలు చేయ కుండా కడపకు రెఫర్ చేయడం ఏమిటని, స్లాట్ బుక్ చేసుకున్న తర్వాత ఎందుకు పరీక్షలు చేయలేదని ఈఎన్‌టీ డాక్టర్‌ను ప్రశ్నించారు. ఈఎన్‌టీ విభాగంలో అవసరమైన ఆధునిక ఆడియో పరికరాలకు ఎంపీ నిధులు కేటాయి స్తామని దివ్యాంగులను ఇబ్బందిపెట్టొద్దని, ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీ సూచించారు. కల్లూరు మండలం తడకనపల్లె గ్రామానికి చెందిన కోట్ల పవిత్ర అనే దివ్యాంగురాలికి చికిత్స నిర్వ హించకుండా కడప రిమ్స్‌కు రెఫర్ చేయడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. స్లాట్ బుక్‌చేసుకున్న దివ్యాంగులకు సకాలంలో అవసరమైన పరీక్షలు చేసి పంపాలన్నారు. హెచ్‌ఓడీ డా.మదన్‌మోహన్, ఆర్ఎంఓ వెంకటేశ్వర్లు, ఈఎన్‌టీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.జైబాకౌశల్, డా.సాహిల్, సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ నరహరి విశ్వనాథరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.కాకరవాడ చిన్నవెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

హార్టికల్చర్ పనులను పరిశీలించిన డ్వామా పీడీ

నంద్యాల రూరల్ ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): నంద్యాల మండలం బ్రహ్మణపల్లె, పాండురంగాపురం గ్రామాల్లో జరగుతున్న హార్టికల్చర్ పనులను మంగళవారం డ్వామా పీడీ సూర్యనారాయణ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎన్ఈజీఎస్ కింద పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు.

అవుట్ సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలి

నంద్యాల రూరల్ ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో అవుట్ సోర్సింగ్ కార్మిలకు పర్మినెంట్ చేయాలని సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు యేసురత్నం, నాగరాజు డిమాండు చేశారు. మంగళవారం స్థానిక కార్యాయంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు.

సర్వేలు పకడ్బందీగా నిర్వహించాలి

జూపాడుబంగ్లా, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పీ4,కౌసల్య, బంగారు కుటుంబాల ఎంపిక సర్వేలు పకడ్బందీగా నిర్వహించి నివేదికలు అందజేయాలని జడ్పీ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి సూచించారు. మంగళవారం ఎంపీ డీవో కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేసి అధికారులతో సమీక్షించారు.

యూరియా కోసం రైతుల ధర్నా

- టోకెన్ ఇచ్చి 15 రోజులైనా యూరియా ఇవ్వలేదని ఆగ్రహం


నందికొట్కూరు వ్యవసాయ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

నందికొట్కూరు రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం మంగళవారం అన్నదాతలు నందికొట్కూరు వ్యవసాయ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. శాతనకోట, అల్లూరు గ్రామ రైతులు తమకు యూరియా అందక నెల రోజులు కావస్తోందని, టోకెన్లను అందజేసి 15 రోజులు దాటిపోయిందని వ్యవసాయ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఆయా గ్రామాల రైతులు మాట్లాడుతూ యూరియా, డీఏపీ కోసం రోజుల తరబడి వేచి చూసినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, రాజకీయ నాయకులు చిన్న, సన్నకారు రైతులకు అన్యాయం చేస్తున్నారని ఏఓ షేక్షావలిని రైతులు నిలదీశారు. దీంతో ఏఓ రైతుల తో దురుసుగా మాట్లాడడంతో వాగ్వివాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ శ్రీనివాసులు, సీఐ ప్రవీణ్ కుమార్ అక్కడికి చేరుకుని ప్రత్యేక పోలీసు సిబ్బందితో రైతులను అదుపు చేశారు. అలాగే ఎమ్మెల్యే స్వగ్రామం అయిన అల్లూరులో రైతు భరోసా కేంద్రం వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరడంతో గందరగోళం ఏర్పడింది.

మహానంది: యూరియాను అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రమాదేవి హెచ్చరించారు. మంగళవారం గాజులపల్లిలోని దీప్తి ఫెర్టిలైజర్, గఫారియా ఎరువుల దుకాణాలను ఏవో నాగేశ్వరరెడ్డి, ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డిలతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. యూరియా కృతిమ కొరత సృష్టిస్తే డీలర్ల లైసన్స్‌లు రద్దు చేస్తామన్నారు.

పగిడ్యాల: ఎరువుల దుకాణాల యజమానులు రైతులకు యూరియాను అధిక ధరకు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ శివరాముడు, వ్యవసాయాధికారి మురళీధర్ హెచ్చరించారు. నెహ్రూనగర్, ముచ్చుమర్రి గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను మంగళవారం వారు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీలో ఏఎస్ఐ సుబ్బరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నందికొట్కూరు: ఎరువుల దుకాణాల యజమానులు ఎమ్మార్పీ ధరలకే ఎరువులను రైతులకు విక్రయించాలని తహసీల్దార్ శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం రెవెన్యూ, అగ్రికల్చర్, పోలీస్ అధికారులు పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. మంగళవారం పట్టణంలోని శ్రీలక్ష్మి ఎరువులు, పురుగు మందుల దుకాణం, మల్లికార్జున ఏజెన్సీలలో ఎరువుల అమ్మకాల రిజిస్టార్‌లను తనిఖీ చేయడంతో పాటు గోదాముల్లో నిల్వ ఉన్న ఎరువుల బస్తాలను పరిశీలించారు. ఈ తనిఖీల్లో ఏవో షేక్షావలి, పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

పాములపాడు: ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని జాయింట్ ఇన్‌స్పెక్షన్ టీమ్ అధికారులు తహసీల్దార్ సుభద్రమ్మ, ఎస్ఐ సురేశ్‌బాబు, ఎవో మహేశ్వరరెడ్డి హెచ్చరించారు. మంగళవారం మండలంలోని జూటూరు గ్రామంలోని ఎరువుల దుకాణాలను వారు తనిఖీ నిర్వహించారు.

కొత్తపల్లి : కొత్తపల్లి మండలంలోని ఆయా రైతు సేవా కేంద్రాల ద్వారా 119 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేసినట్లు తహసీల్దార్ ఉమారాణి, ఏవో అమీరున్నిసా బేగం తెలిపారు. మంగళవారం పోలీసు బందోబస్తు మధ్య అధికారులు యూరియాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున అందించామన్నారు. ఎస్ఐ జయశేఖర్, ఏఈవో నాగశ్రీ, టీడీపీ మాజీ మండల కన్వీనర్ చంద్రశేఖర్ రెడ్డితో పాటు వీఆర్వోలు పాల్గొన్నారు.

ఊరంతా చవితి సందడి

- కొలువుదీరనున్న గణనాథులు
- మండపాల వద్ద సందడి
- నేటి నుంచి పూజలందుకోనున్న లంబోదరుడు

డోన్ రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జై గణేశా.. జైజై గణేశా అంటూ వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు మండపాలు, విగ్రహాల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. బుధవారం నుంచి వినాయక ఉత్సవాలు ఘనంగా ప్రారంభం కానున్నాయి. ఆయా వీధుల్లో కొలువుదీరనున్నారు. డోన్ పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా, రూరల్ సీఐ రాకేష్‌బాబు, ఎస్‌ఐలు మమత, శరత్ కుమార్ రెడ్డి, రవిప్రకాష్, పోలీసు సిబ్బంది బందోబస్తు పర్యవేక్షణలో నిమగ్నమయ్యారు. గ్రామాల్లో మూడు రోజులు, పట్టణంలో ఐదు రోజుల పాటు ఉత్సవాలు జరుపుకోవడానికి పోలీసులు అనుమతి ఇచ్చారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పండుగ సరుకులకు, వివిధ పూజా సామగ్రికి గ్రామాల నుంచి ప్రజలు తరలిరావడంతో పాతబస్టాండు ప్రాంతం కిక్కిరిసిపోయింది.

కొలిమిగుండ్ల: మండపాలకు చేరుకుంటున్న గణనాథులకు డప్పు వాయిద్యాలు, టపాసుల పేల్చి, మంగళ వాయిద్యాల మధ్య ఘనస్వాగతం పలికారు. మునుపెన్నడూ లేనివిధంగా పల్లెల్లో పెద్ద ఎత్తున గణనాథుల స్వాగత ఉత్సవాలు నిర్వహించడం భక్తులను విశేషంగా అకట్టుకుంది. మండలకేంద్రమైన కొలిమిగుండ్లలో వీధి వీధినా గణనాథుడు మండపాల్లో కొలువు దీరడంతో సర్వత్రా చవితి సందడి కనువిందు చేస్తోంది.

కోవెలకుంట్ల : పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో బొజ్జ గణపయ్యలు కొలువు దీరేందుకు సిద్ధమయ్యారు. మండపాలకు భక్తులు ప్రత్యేక అలంకరణతో మండపాలు ఏర్పాటు చేశారు.

చాగలమర్రి: ఆయా కాలనీల్లో మండపాలను ఏర్పాటు చేసి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు సిద్ధమయ్యారు. చాగలమర్రి గ్రామంలోని గాంధీబజార్‌లో రంగు రంగులతో తయారు చేసిన వినాయక విగ్రహాలను తోపుడు బండ్లపై విక్రయించారు. మరి కొందరు వినాయకపూజకు అవసరమైన పండ్లు, పూలు, పలు రకాల ఆకులను విక్రయించడంతో గ్రామంలో చవితి సందడి నెలకొంది.

రుద్రవరం: మండపాల్లో గణనాథులను కొలువుదీర్చడంలో యువత నిమగ్నమయ్యారు. పల్లెల్లో వినాయకచవితి సందడి మొదలైంది. ట్రాక్టర్లలో వినాయకుడి విగ్రహాలు మేళతాళాలతో తీసుకుని గ్రామాలకు చేర్చారు.

బేతంచెర్ల: మండలంలోని ఆయా గ్రామాల్లో పట్టణంలో వినాయక చవితి సందడి కనిపించింది. గణేశ్ మండపాల వద్ద విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు నిర్వహకులు సర్వం సిద్ధం చేస్తున్నారు. అలాగే పండుగకు ప్రజలు మట్టి విగ్రహాలు, చిన్న విగ్రహాలు, పూజా సామాగ్రిని కొనుగోలు చేసేందుకు మహిళలు, ప్రజలు భారీగా తరలిరావడంతో పాతబస్టాండు వద్ద సందడి నెలకొంది.

ఉచిత మట్టి విగ్రహాలు పంపిణీ

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం మట్టి వినాయక విగ్రహాలను భక్తులకు పంపిణీ చేశారు. మట్టి విగ్రహాలు ఏర్పాటు చేసి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో రోటరీ వెంకటేశ్వరరెడ్డి, సభ్యులు మాణిక్యంశెట్టి, సత్తార్, శ్రీధర్, కేవీ సుబ్బారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

బనగానపల్లె: మండలంలో వినాయకచవితి సంబరాలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. వినాయకున్ని పూజించడానికి మట్టి విగ్రహాలు, సామగ్రి కొనుగోలుతో పట్టణంలో కోలాహలం నెలకొంది. పట్టణంలో సుమారు 50చోట్ల వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. అలాగే ప్రతిగ్రామంలోనూ వినాయక విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్నారు. పట్టణంలో వినాయక ఉత్సవ కమిటీ గౌరవ సలహాదారు టంగుటూరు శ్రీనయ్య, అధ్యక్షుడు మల్లారెడ్డి, సభ్యుల ఆధ్వర్యంలో పట్టణంలో గణేశ్ ఉత్సవాలకు సంబంధించి జెండాలు కట్టించారు.

మట్టి విగ్రహాలను పంపిణీ చేసిన డీఎస్పీ

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డలోని నాలుగు రోడ్ల సర్కిల్‌లో డీఎస్పీ ప్రమోద్ మంగళవారం మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. కాలుష్యాన్ని నివారించి సుస్థిరమైన ఉత్సవ సంస్కృతిని ఏర్పర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ టౌన్ సీఐ యుగంధర్, ఎస్‌ఐలు నగీనా, జయ్యప్ప, పోలీసు స్పింది పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని ఆవుల పుల్లారెడ్డి సేవాసమితి ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు.

ప్రశాంతంగా జరుపుకోవాలి

దొర్నిపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం నుంచి నిర్వహించే వినాయకచవితి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఆళ్లగడ్డ సీఐ మురళీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో గణేష్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రామిరెడ్డి, సిబ్బంది సునిల్, ప్రసాద్, కుమార్, కమిటీ సభ్యులు ఉన్నారు.

- మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకోకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఏడీఈ సతీష్‌కుమార్‌రెడ్డి, ఏఈ అనంతరావు సూచించారు. నాణ్యమైన విద్యుత్ తీగలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విగ్రహాలు ఏర్పాటు చేసుకోరాదని అన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే ఆయా గ్రామాల లైన్‌మెన్లను సంప్రదించాలని సూచించారు.

కొలిమిగుండ్ల : మట్టి వినాయకులు ఏర్పాటు చేసుకొని చవితి ఉత్సవాలు నిర్వహించుకోవడం ద్వారా పర్యావరణ రక్షణ సాధ్యపడుతుందని రామ్‌కో సిమెంట్ పరిశ్రమ అడ్మిన్ ప్రెసిడెంట్ రామరాజు సూచించారు. మంగళవారం స్థానిక రామ్‌కో పరిశ్రమలో పరిశ్రమ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌తో మీనాక్షీసుందరమ్ తో కలిసి 200మందికి మట్టి గణపతిలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ జీఎం రవికుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



కొలిమిగుండ్లలో డప్పు వాయిద్యాలతో వినాయకుడిని తీసుకెళ్తున్న యువకులు



బేతంచెర్ల పాతబస్టాండులో పండుగ సామగ్రి కొనుగోలు చేస్తున్న గ్రామీణులు



డోన్‌లో కొలువు దీరిన గణనాథుడు



బనగానపల్లెలో..



బేతంచెర్లలో విగ్రహాలను కొనుగోలు చేస్తున్న స్థానికులు



ఆళ్లగడ్డలో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న డీఎస్పీ ప్రమోద్



చాగలమర్రి: విద్యుత్ బల్బులతో అలంకరించిన మండపం



బేతంచెర్లలో వినాయక మండపం



బనగానపల్లెలో మట్టి విగ్రహాలను కొనుగోలు చేస్తున్న స్థానికులు



మట్టి గణపయ్యలను పంపిణీ చేస్తున్న రామ్‌కో అడ్మిన్ ప్రెసిడెంట్ రామరాజు

పర్యావరణాన్ని కలుషితం చేయొద్దు



మట్టి విగ్రహాలు తయారు చేసిన టంగుటూరు జడ్పీ విద్యార్థులు

బనగానపల్లె, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని కలుషితం చేయకుండా కాపాడాల్సిన బాధ్యత భావి భారత విద్యార్థులపై ఉందని టంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల హెచ్‌ఎం సింగయ్య అన్నారు. హెచ్‌ఎం ఆధ్వర్యంలో గ్రీన్ కార్ప్స్ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు ఓబయ్య, దస్తగిరిరెడ్డి, హరినాథ్‌గౌడ్, సుబ్బారెడ్డి, వెంకటరెడ్డి, పలువురు విద్యార్థులు మట్టి గణపతులు తయారు చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చవితి విశిష్టతను వివరించారు.

ఉయ్యాలవాడ: మండలంలోని హరివరం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధుసుధన్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఐదు అడుగుల మట్టి విగ్రహాన్ని తయారు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు పీకే బాబు, రమణ, రత్నమయ్య, నాగేశ్వరయ్య, నారాయణ, లక్ష్మీదేవి, శివపార్వతి, రాము ఉన్నారు.

చాగలమర్రి: మండల కేంద్రం సమీపంలోని భారతీ విద్యా మందిరంలో విద్యార్థులు మట్టితో వినాయక విగ్రహాలను తయారు చేశారు. పర్యావరణాన్ని కాపాడుకుందామని ర్యాలీ నిర్వహించారు.

హెచ్ఐవీపై అవగాహన ఉండాలి

బనగానపల్లె, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీపై అవగాహన ఉండాలని జిల్లా అడిషనల్ వైద్యాధికారి డాక్టర్ శారదాబాయి అన్నారు. మంగళవారం బనగానపల్లె కమ్యూనిటీ సెంటర్‌లో ఐసీటీసీ, టీబీ సెంటర్‌ను ఆమె తనిఖీ చేశారు. రికార్డులన పరిశీలించారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సెలర్ విజయలక్ష్మి, టీబీ సిబ్బంది నరసింహులు, హ్యాండ్స్ స్వచ్ఛంద సభ్యులు మధుకుమార్, ఆఫ్రిన్, హసీనా, సుకన్య, రాధామహేశ్వరి పాల్గొన్నారు.

బాలికలకు కంటి వైద్య పరీక్షలు

చాగలమర్రి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని కస్తూర్బా పాఠశాలలో మంగళవారం కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జిల్లా పారామెడికల్ ఆప్తాలమిక్ కంటి వైద్య నిపుణులు రమేష్ బాలికలకు కంటి పరీక్షలు చేశారు. ఎస్‌వో స్వప్న, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ సమత, ఏఎన్‌ఎం వెంకటలక్ష్మి, ఆశా కార్యకర్తలు పెద్దక్క, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

ఉపాధి పనులపై అవగాహన కల్పించాలి

ఉయ్యాలవాడ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో ఉమా మహేశ్వరరావు తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బంది, స్వామిత్వా టీంతో ఆయన పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఏపీవో హరిక్రిష్ణ, అధికారులు లక్ష్మీ నారాయణ, రవికుమార్, మల్లికార్జున ఉన్నారు.

చెరువుల మరమ్మతులకు ప్రతిపాదనలు

ఉయ్యాలవాడ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా చెరువుల అభివృద్ధికి రూ. 2.49 కోట్ల నిధులు అవసరం అవుతున్నట్లు ప్రతిపాదనలు పంపుతున్నామని మైనర్ ఇరిగేషన్ ఏఈ రామ్‌ప్రసాద్ తెలిపారు. మంగళవారం రూపనగుడి చెరువును పరిశీలించారు.

సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు

అవుకు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులకు సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలను అందిస్తున్నట్లు పశుసంవర్ధకశాఖ ఏడీ మారుతిసకారం అన్నారు. మంగళవారం అవుకు పశువైద్యశాల కార్యాలయంలో పశువైద్యాధికారి డాక్టర్ భారతీదేవితో కలిసి సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పశువైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: మండలంలోని పాడి రైతులకు 75 శాతం సబ్సిడీతో గడ్డి విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు పశు వైద్యాధికారి పుల్లయ్య మంగళవారం తెలిపారు. ఐదు కేజీల ప్యాకెట్ ధర రూ. 460 కాగా, సబ్సిడీ పోగా కేవలం రూ. 115 కే ఇస్తామన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

మొక్కజొన్న పంట నాశనం

రుద్రవరం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : అడవి పందుల దాడిలో మొక్కజొన్న పంట నాశనం అయింది. మండలంలోని వెలగలపల్లె గ్రామానికి చెందిన రైతులు ధర్మరాజు, మనోహర్, మధు, దస్తగిరి 51 ఎకరాల్లో మొక్కజొన్నపంటను సాగు చేశారు. అడవి పందులు దాడి చేసి పంటను నాశనం చేశాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించాలన్నారు.

చిల్లర రాజకీయాలు మానుకోవాలి

- డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి

డోన్ టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వైసీపీ, ఆ పార్టీకి సంబంధించిన మీడియా చిల్లర రాజకీయాలు మానుకోవాలని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి సూచించారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్‌తో అమలు చేస్తుంటే.. వైసీపీ నాయకులు, ఆ పార్టీకి సంబంధించిన మీడియా సిగ్గు లేకుండా అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఒక కలే అని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై రాష్ట్ర ప్రజలు మరో 20 ఏళ్ల కొనసాగించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

- జిల్లా ప్రోగ్రామ్ అధికారి జగదీష్‌చంద్రారెడ్డి

ఆళ్లగడ్డ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రతినెల నిర్వహించే సంచార చికిత్స క్యాంపులలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా ప్రోగ్రామ్ అధికారి జగదీష్ చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మండలం ఓబులంపల్లె గ్రామంలో విలేజ్ హెల్త్ కేంద్రంలో వైద్యురాలు స్వాతి నిర్వహిస్తున్న సంచార చికిత్సా కేంద్రాన్ని తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడారు. ఉచిత వైద్య పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్‌ఎడ్యూకేటర్ అధికారి వెంకటరమణ, మిడ్‌వెల్ హెల్త్ ప్రొవైడర్ అశోక్, ఆరోగ్య కార్యదర్శి హుసెన్‌బి, సంచార చికిత్స వాహన సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

39 సెల్‌ఫోన్లు రికవరీ

బేతంచెర్ల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): బేతంచెర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ గ్రామాల్లో పోగొట్టుకున్న 39 సెల్‌ఫోన్లను రికవరీ చేసి డోన్ డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బాధితులకు సీఐ వెంకటేశ్వరరావు అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ పోలీసుల ను అభినందించారు. బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

విశ్రాంత హెచ్‌ఎం మృతి

బేతంచెర్ల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత హెచ్‌ఎం, టీడీపీ సీనియర్ నాయకుడు బండారు సుబ్బారావు అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. విషయం తెలిసిన రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి ఆయన భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు ధర్మవరం గౌతమ్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి, టీడీపీ నాయకులు పాల్గొని సంతాపం తెలిపారు.

ప్రతి రైతు శాస్త్రవేత్త కావాలి

చాగలమర్రి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రతి రైతు శాస్త్రవేత్త కావాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సంచాలకులు సరళమ్మ అన్నారు. మంగళవారం ముత్యాలపాడు, డి. కొత్తపల్లె గ్రామాల్లో కృషి విజ్ఞాన కేంద్రం యాగంటిపల్లి శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సుధాకర్, రవి, ఏవోలు చంద్రశేఖర్‌రెడ్డి, రంగనేతాజీ, సర్పంచ్ బాలిశ్వర్‌రెడ్డి, పాలడైరీ చైర్మన్ రమణారెడ్డి, రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

దొర్నిపాడు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రైతులు పంట నమోదు చేయించుకోవడం వలన ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగితే నష్టపరిహారం పొందవచ్చని వ్యవసాయాధికారి ప్రమీల అన్నారు. మంగళవారం మండలంలోని దొర్నిపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మినుము పంటను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో మణికంట, రైతులు ఉన్నారు.

చదువుతో పాటు క్రీడలు అవసరం

చాగలమర్రి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): విద్యతో పాటు క్రీడలు అవసరమని ఎంఈవో న్యామతుల్ల అన్నారు. మంగళవారం చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. హెచ్‌ఎం జీవయ్య, ఇన్‌చార్జి హెచ్‌ఎం క్రిష్ణశాస్త్రి, ఉపాధ్యాయులు మహబూబ్‌బాష, శివశంకర్, పీడీ శ్రీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా మదర్ థెరిస్సా జయంతి



మదర్ థెరిస్సా చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు

ఆళ్లగడ్డ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ గంగన్న ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా జయంతిని మంగళవారం నిర్వహించారు. థెరిస్సా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ గంగన్న మాట్లాడుతూ సేవకు మారు పేరుగా మదర్ థెరిసా నిలిచారన్నారు. పేద విద్యార్థులకు ఆశ్రయం కల్పించి మానవ సేవయే మాధవ సేవ అని చాటి చెప్పారని కొనియాడారు. అధ్యాపకులు నాగమస్తాన్, గాయత్రి, కాశీ విశ్వనాథ్, వెంకటేష్ కుమార్, వెంకటసుబ్బారెడ్డి, జయచంద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్టాకు, ధరల బోర్డులు తప్పనిసరి

ఉయ్యాలవాడ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువుల దుకాణాల్లో స్టాకు, ధరల బోర్డులు తప్పని సరిగా ప్రదర్శించాలని తహసీల్దారు సువర్ణదేవి సూచించారు. మంగళవారం మాయలూరు, ఉయ్యాలవాడ గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను ఏవో శ్రీనివాసరెడ్డి, ఏఎస్‌ఐ సుదర్శన్‌రెడ్డితో కలిసి ఆమె తనిఖీ చేశారు.

ఎరువుల దుకాణాలపై దాడులు

కోవెలకుంట్ల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో విజిలెన్స్ అధికారులకు పలు ఎరువుల దుకాణాలపై దాడులు నిర్వహించారు. డీలర్లు ఎరువులను అధిక రేట్లకు విక్రయిస్తున్నట్లు రైతులు నుంచి ఫిర్యాదు రావడంతో మంగళవారం విజిలెన్స్ ఎస్‌ఐ వెంకట ప్రసాద్, సిద్దయ్య, తహసీల్దారు పవన్‌కుమార్ రెడ్డి, వ్యవసాయాధికారి సుధాకర్‌రెడ్డి, ఏఎస్‌ఐ వెంకటేశ్వరరెడ్డి కలిసి పట్టణంలోని ఆరు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. సుమారు 500 బస్తాలను సీజ్ చేశారు. విజిలెన్సు అధికారులు మాట్లాడుతూ అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

విజృంభిస్తున్న విష జ్వరాలు

- రోగాలతో అల్లాడుతున్న పల్లె ప్రజలు

కొలిమిగుండ్ల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : కొద్ది రోజులుగా పల్లెల్లో పెరిగిన వైరల్ ఫీవర్స్‌తో ప్రజలు అల్లాడిపోతున్నారు. మండలంలోని కొలిమిగుండ్ల, మీర్జాపురం, బెలుం, తుమ్మలపెంట, అంకిరెడ్డిపల్లె తదితర గ్రామాల్లో ప్రజలు జ్వరాలతో అల్లాడుతున్నారు. ఒక్కో గ్రామంలో సుమారు 100మంది వరకూ రోగాల బారిన పడ్డారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పలువురు రోగులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. వాతావరణ మార్పుతో దగ్గు, జలుబు, వైరల్ ఫీవర్ విజృంభిస్తోందని వైద్యులు తెలుపుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దోమల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నిబద్ధతతో పని చేసినవారికి పదవులు

(5వ పేజీ తరువాయి)

ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ చైర్మన్, రాష్ట్ర పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరి పూల నాగరాజు మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు కూడా టీడీపీకి కార్యకర్తలే బలం అని కొనియాడారు. అనంతరం పార్లమెంట్ అనుబంధ, సాధికార కమిటీల కోసం వినతులు స్వీకరించారు. కొందరు అభిప్రా యాలను సైతం అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, మార్క్‌ఫెడ్ చైర్మన్ తులసీరెడ్డి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎండీ ఫిరోజ్, విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఏవీ సుబ్బారెడ్డి, టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు గౌరు వెంకటరెడ్డి, భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అధికసంఖ్యలో తరలివచ్చిన నాయకులు

స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఉదయం 9 గంటల నుంచే జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి కార్యకర్తలు, నాయకులతో పాటు పదవుల ఆశావహులు చేరుకున్నారు. నియోజకవర్గాల వారీగా ఆశావహుల అభిప్రాయాలతో పాటు వినతులను స్వీకరించారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. వివిధ పదవులకు సుమారు 220మంది ఆశావహులు వినతులు అందజేసినట్లు తెలిసింది.

అధ్యక్ష పదవి కోసం పోటీ..

టీడీపీ అధ్యక్ష పదవి కోసం 12మంది(డజన్ మంది) దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. వీరిలో ప్రస్తుత అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌గౌడ్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసీరెడ్డి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎండీ ఫిరోజ్, హైకోర్టు న్యాయవాది ఆళ్లగడ్డకు చెందిన గోగిశెట్టి నరసింహారావు, సీనియర్ న్యాయవాది, మాజీ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రామచంద్ర రావు, సివిల్ సప్లయ్ డైరెక్టర్ మహేష్ నాయుడు(నందికొట్కూరు), చిన్న వెంకట స్వామి(ఎస్సీ), భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి, మాజీ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ఏవీ సుబ్బారెడ్డి, మరో ఇద్దరు ఉన్నట్లు తెలిసింది. ఉపాధ్యక్ష పదవి కోసం ముగ్గురు, జిల్లా ప్రధాన కార్యదర్శి కోసం ముగ్గురు దరఖాస్తు చేసుకున్నారని సమాచారం. ఇదిలా ఉండగా.. నంద్యాలకు చెందిన ఇద్దరు(గోవిందనాయుడు, రామక్రిష్ణ)వాల్మీకులు రాష్ట్ర పార్టీలో కార్యదర్శులుగా అవకాశం కల్పించాలని వినతులు అందజేశారని తెలిసింది.



కార్యకర్తల నడుమ కూర్చొన్న ఎన్‌ఎండీ ఫిరోజ్